నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM




# ఉగ్రవాదుల కోసం
# కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

జమ్ముకశ్మీర్‌లోని పూంచ్, రాజౌరీ జిల్లాల్లో ఉగ్రవాదుల కోసం భారీగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. సీనియర్ ఆర్మీ, పోలీస్ ఆఫీసర్లు ఆ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పారామిలిటరీ దళాలు, అదనపు బలగాలు మోహరించాయి. శనివారం ఉదయం నుంచి పూంచ్, రాజౌరీ జిల్లాల్లో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేశారు. విస్తృత స్థాయిలో కూబింగ్ నిర్వహిస్తున్నారు. కాగా, ఇటీవల రెండు ఆర్మీ వాహనాలపై జరిగిన దాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.

# వైకుంఠ ఏకాదశి.. ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ధనుర్మాసం శుక్లపక్షంలో వచ్చే ఈ ముక్కోటి ఏకాదశి రోజున మూడు కోట్ల మంది దేవతలు భూలోకానికి వచ్చి శ్రీమహా విష్ణువును పూజిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శిస్తే సమస్త పుణ్యపరంపరలు చేకూరతాయని భక్తుల విశ్వాసం. అందుకే, తెల్లవారుజామునే స్వామివారి దర్శనార్థం ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. తిరుమలలో శనివారం తెల్లవారుజామున 1.45 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి పలువురు ప్రముఖులు తిరుమలకు తరలివచ్చారు. వారిలో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర బాబు, జస్టిస్ హిమ కోహ్లీ, జస్టిస్ ఎస్.ఎల్. భట్టి, జస్టిస్ శ్యామ్ సుందర్, జస్టిస్ తారాల రాజశేఖర్, కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, ఏపీ మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణ స్వామి, ఉష శ్రీచరణ్, మేరుగు నాగార్జున, చెల్లబోయిన, అంబటి రాంబాబు, కారుమూరి, గుడివాడ అమర్నాథ్, రోజా, ఎంపీలు ప్రభాకర్‌రెడ్డి, రఘురామ కృష్ణంరాజు, సీఎం రమేశ్, ఉపసభాపతి వీరభద్ర స్వామి, తెదేపా నేత అచ్చెన్నాయుడు ఉన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం 6.42 గంటలకు ఉత్తర రాజ గోపురం చెంత ఆలయ దేవుడు నారసింహుడు మహా విష్ణువు రూపంలో భక్త జనానికి దర్శనమిచ్చారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులతో పాల్గొని దైవ దర్శనం చేసుకున్నారు. భక్త జనులు తరలివస్తున్నారు.





## తెలంగాణలో ఈ నెల 28 నుంచి
# కొత్త రేషన్ దరఖాస్తులు!

ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొత్త రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబాలకు ఊరటనిచ్చే ప్రకటన చేసింది. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులను ఆహ్వానించిందేకు సిద్ధమవుతోంది. ఈ నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. అర్హులైన వారు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలుస్తోంది. అర్హుల ఎంపిక ప్రక్రియను క్షేత్ర స్థాయిలోనే చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సంబంధిత డాక్యుమెంట్స్‌తో ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న తర్వాత వెరిఫికేషన్ కోసం గ్రామ సభలు, నగరాల్లో అయితే బస్తీ సభలను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. దీంతో అర్హులైన వారికి మాత్రమే రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది, ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. రేషన్ సరకులతో పాటు ఆరోగ్య శ్రీ పథకానికి కూడా రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలనే విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రేషన్ కార్డులు లేక పోవడంతో చాలా మంది పేదలు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. తాజాగా ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. ఇక రేషన్ కార్డుల్లో మార్పులు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. పెళ్లైన మహిళలు ఒక కార్డులో నుంచి మరో కార్డులోకి మారడం, కొత్తగా చిన్నారుల పేర్లను కార్డులో చేర్చాలని ప్రతిపాదనలు వచ్చిన నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి వీరికి కూడా అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న తరుణంలో ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల్ని చేర్చేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొత్తం 6,47,297 కొత్త రేషన్‌కార్డులు జారీచేసినట్లు అధికార గణంకాలు చెబుతున్నాయి. ఇక తెలంగాణలో ఇప్పటి వరకు మొత్తం 2.82 కోట్ల మందికి పైగా రేషన్ లబ్ధిదారులు ఉన్నారు.



## ఇవాళ ఆటో, ఊబర్ వాహనాల డ్రైవర్లతో
# సీఎం రేవంత్ భేటీ?

ఇవాళ సాయంత్రం 4 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నట్లు సమాచారం. ఆటో, ఊబర్ వాహనాల డ్రైవర్లతో సమావేశం అయ్యే అవకాశం ఉంది. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంతో గత కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో, ఊబర్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. ఇక, ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై సీఎం రేవంత్ రెడ్డి చర్చించనున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అనుబంధ సంఘం తెలంగాణ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రానున్న రెండు రోజుల్లో నిరసన కార్యక్రమాలకు రెడీ అవుతున్నారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకంపై పునరాలోచించాలన్నారు. లేకుంటే ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయంగా ప్రతి నెల రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ఈ పథకం ద్వారా తాము చాలా వరకు నష్టపోతున్నామని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. మహాలక్ష్మీ పథకం వల్లే చాలా వరకు ఆటోలను ఫైనాన్స్‌లో కొనుగోలు చేసిన మేము నెలవారీ.. పేమెంట్స్ కట్టేందుకు తీవ్రంగా కష్టపడుతున్నామని వారు పేర్కొంటున్నారు. తమ ఆటోలో ఎవరు ఎక్కకపోవడంతో ఆటో స్టాండ్స్ అన్నీ నిర్మానుషంగా మారాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచించి ఆటో కార్మికులకు ఉపయోగపడేలా, వారి కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపే విధంగా తగిన నిర్ణయం తీసుకోవాలని ఆటో, ఊబర్ డ్రైవర్లు కోరుతున్నారు. గతంలో 1000 నుంచి 1500 రూపాయల వరకు రోజువారి సంపాదన వచ్చేది.. కానీ, మహిళలకు ఫ్రీ బస్సు పథకం ప్రారంభమైనప్పటి నుంచి రోజుకు కేవలం రూ.100 నుంచి 200 వరకు కూడా రావడం లేదని ఆటో కార్మికులు వాపోతున్నారు.



## సలార్ ఫస్ట్ డే కలెక్షన్స్..
# ప్రభాస్ బంపర్ రికార్డ్!

తెరకెక్కించిన చిత్రం 'సలార్'. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 22న ఈ సినిమా విడుదలైంది. ప్రస్తుతం ఎక్కడ చూసిన కూడా సలార్ సందడే కనిపిస్తుంది. చాలా ఎళ్ల తర్వాత ప్రభాస్ భారీ హిట్ కొట్టాడు. దీంతో ఆయన ఫ్యాన్స్ కూడా ఫుల్ జోష్‌లో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఏరియాల్లోనూ హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో సలార్ రికార్డ్ క్రియేట్ చేస్తున్నాడు. తాజాగా సలార్ ప్రపంచవ్యాప్తంగా మొదటిరోజు కలెక్షన్స్ రూ. 175 కోట్లు అని సినీ ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రం అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 90 కోట్లకు పైగా వసూలు చేసిందని తెలుస్తోంది. ఈ ఏడాదిలో మొదటిరోజు బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ ఇచ్చిన చిత్రంగా సలార్ రికార్డ్ క్రియేట్ చేసింది. తర్వాతి స్థానంలో దళపతి విజయ్ నటించిన 'లియో', ప్రభాస్ 'ఆది పురుష్' చిత్రాలు ఈ ఏడాదిలో రూ.140 కోట్ల గ్రాస్‌తో అత్యధిక ఓపెనింగ్స్ అందుకున్న చిత్రాలుగా ఉన్నాయి. ఇప్పటి వరకు భారత్‌లో మొదటిరోజు అత్యధిక ఓపెనింగ్స్ కలెక్షన్స్ అందుకున్న చిత్రంగా RRR మాత్రమే ఉంది. ఈ సినిమాకు మొదటి రోజు వచ్చిన కలెక్షన్స్ రూ. 223 కోట్ల రికార్డ్ పదిలంగా ఉంది. ఆ తర్వాత కేజీఎఫ్-2 రూ. 165 కోట్ల రికార్డ్‌ను సలార్ దాటేశాడు. దీంతో మొదటిరోజు బిగ్గెస్ట్ కలెక్షన్స్ సాధించిన చిత్రాల జాబితాలో సలార్ రెండో స్థానానికి చేరుకుంది. ఈ రెండు చిత్రాలు సౌత్ ఇండియా నుంచే ఉండటం విశేషం. కానీ ఈ ఏడాది రెండు వరుస బ్లాక్ బస్టర్ చిత్రాలను అందించిన షారుక్ ఖాన్ మాత్రం డంకీ చిత్రంతో కలెక్షన్స్ పరంగా వెనుకపడ్డాడు.



## నటుడు మన్సూర్ అలీఖాన్‌కు
# రూ.లక్ష జరిమానా

నటులు త్రిష, ఖుష్బూ, మెగాస్టార్ చిరంజీవిపై నటుడు మన్సూర్ అలీఖాన్ వేసిన పరువునష్టం దావా పిటిషన్‌ను రూ.లక్ష జరిమానాతో మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. త్రిషపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసినందుకు అలీఖాన్‌ను ఆమెతోపాటు ఖుష్బూ, చిరంజీవి తదితరులు ఖండించారు. జాతీయ మహిళా కమిషన్ సిఫారసు మేరకు చెన్నై థౌజండ్‌లైట్ ఆల్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో మన్సూర్ అలీఖాన్‌పై కేసు నమోదు చేశారు. మన్సూర్ అలీఖాన్ త్రిషను క్షమాపణలు కోరారు. ఈ నేపథ్యంలో పూర్తి వీడియో చూడకుండా తన పేరుకు కలంకం తెచ్చారంటూ త్రిష, ఖుష్బూ, చిరంజీవిలు తలా రూ.కోటి చెల్లించాలని మద్రాసు హైకోర్టులో పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు వచ్చింది. త్రిష తరఫున.. ముగ్గురికి వ్యతిరేకంగా ఒకే కేసుగా దాఖలు చేయడం కుదరదని, తనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో అలీఖాన్‌పై నేర చర్యలు చేపట్టారన్నారు. బేషరతుగా క్షమాపణలు చెప్పారన్నారు. మన్సూర్ అలీఖాన్ తరఫున.. ముగ్గురిపై ఒకే కేసు దాఖలు చేయడం కుదురుతుందని, తాను మాట్లాడిన పూర్తి వీడియో దాఖలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇరు తరఫు వాదనలు విన్న న్యాయమూర్తి మన్సూర్ అలీఖాన్ వ్యాఖ్యలను ఖండిస్తూ ముగ్గురు సామాజిక మాధ్యమంలో తమ అభిప్రాయాలు తెలిపారన్నారు. వాటిని పరువునష్టంగా పరిగణించలేరన్నారు. కోర్టు సమయాన్ని వృథా చేయాలనే ఉద్దేశంతో, పబ్లిసిటీ కోసమే ఈ కేసు దాఖలైందని తెలిపి మన్సూర్ అలీఖాన్ పిటిషన్‌ను రూ.లక్ష జరిమానాతో కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. జరిమానాను రెండు వారాల్లో అడయార్ క్యాన్సర్ ఆస్పత్రికి చెల్లించాలని ఉత్తర్వు ఇచ్చారు.


# వైఎస్ఆర్ సీపీకి చివరి రోజులు దగ్గర పడ్డాయి: నారా లోకేశ్



ఎన్ఆర్ఐ టీడీపీ కార్యకర్త యశస్వి బొద్దులూరి అరెస్టును టీడీపీ నేతలు ఖండించారు. అరెస్టుకు నిరసనగా గుంటూరు సీఐడీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదిని హింసించినట్లు యశస్వితో సీఐడీ వ్యవహరించడం దుర్మార్గమని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. "యశస్వి అరెస్టును ఖండిస్తున్నా. ప్రశ్నించే గొంతులను నిర్బంధాల ద్వారా అణిచివేయాలని వైకాపా ప్రభుత్వం అనుకుంటోంది. న్యాయం జరిగే వరకు విశ్రమించబోము. వైకాపాకి చివరి రోజులు దగ్గర పడ్డాయి" అని లోకేశ్ మండిపడ్డారు. యశస్విను అరెస్టు చేయడం సైకోయిజానికి నిదర్శనమని ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. యశస్వి భద్రతపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ తప్పులు, అవినీతిని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. "స్వేచ్ఛగా అభిప్రాయాన్ని వెల్లడించే హక్కు లేదా? జగన్ నియంతృత్వ పోకడలకు మూల్యం చెల్లించక తప్పదు" అని అన్నారు. అక్రమ అరెస్టులతో అణిచివేయాలని చూస్తున్నారని చింతకాయల అయ్యన్న పాత్రుడు విమర్శించారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు.

## వచ్చే నెల 6న గమ్యస్థానానికి
# ఆదిత్య ఎల్1: ఇస్రో చైర్మన్


శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సెప్టెంబర్ 2న విజయవంతంగా ప్రయోగించిన ఆదిత్య ఎల్1 మిషన్ పై ఇస్రో చైర్మన్ ఆసక్తికర వాఖ్యలు చేశారు. సోలార్ మిషన్ ఆదిత్య-ఎల్1 జనవరి 6న భూమికి 1.5 మిలియన్ కిమీ దూరంలో ఉన్న లాగ్రాంజియన్ పాయింట్ గమ్యస్థానానికి చేరుకుంటుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తెలిపారు. జనవరి 6న ఆదిత్య-ఎల్1 అంచనా వేయబడిన విధంగా సరైన సమయంలో చేరుకుంటుందని తెలిపారు.



## 3,420కి చేరిన
# కరోనా వైరస్ కేసులు

దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా గత 24 గంటల్లో 423 కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే నలుగురు మరణించారని తెలిపింది. నిన్న అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 266 కేసులు నమోదు కాగా.. ఏపీలో 8, తెలంగాణలో 9 మందికి కరోనా సోకింది. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 3,420కి చేరింది.

# ఆర్జీవీ వ్యూహం సినిమాకు బ్రేక్..



దర్శకుడు రాంగోపాల్‌వర్మ రూపొందించిన "వ్యూహం" మూవీకి షాక్ ఇచ్చింది కోర్టు. ఈ ను ఓటీటీతో పాటు ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో విడుదల చేయడాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నేడు విజయవాడలో గ్రాండ్‌గా ప్లాన్ చేసింది చిత్ర యూనిట్. డైరెక్టర్ ఆర్జీవీ తెరకెక్కించిన వ్యూహం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. రిలీజ్ కాకుండానే ఈ చుట్టూ రచ్చ రచ్చ జరుగుతోంది. ఏపీ సీఎం వైఎస్ జగన్ రాజకీయ జీవితంలో ఎదురైన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందించిన వ్యూహం చిత్రాన్ని..ఈ నెల 29న విడదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది మూవీ యూనిట్. అయితే ఈ చిత్రానికి ఇచ్చిన సెన్సార్ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని కోరుతూ టీడీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు. 'వ్యూహం' విడుదలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చిత్రాన్ని ఓటీటీ, ఆన్‌లైన్, ఇంటర్నెట్ వేదికల్లో ఎక్కడా విడుదల చేయొద్దని ఆదేశించింది. చిత్రాన్ని నిర్మించిన రామదూత క్రియేషన్స్‌తో పాటు దర్శకుడు రాంగోపాల్ వర్మకు కూడా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 27కి వాయిదా వేసింది. మరోవైపు వ్యూహం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నేడు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గ్రాండ్ నిర్వహిస్తోంది మూవీ యూనిట్.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## అనంతపురం జిల్లాలో బస్సు-ట్రాక్టర్ ఢీ: నలుగురి మృతి

బస్సు, ట్రాక్టర్ ఢీకొని నలుగురు మృతిచెందిన సంఘటన అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద చోటుచేసుకుంది. శనివారం వేకువ జామున బియ్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. మృతులను గుత్తి మండలం మామిడూరుకు చెందిన చిన్న తిప్పయ్య(45), శ్రీరాములు(45), నాగార్జున(30), శ్రీనివాసులు(30)గా గుర్తించారు. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ సహా మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. గాయపడ్డ నరేశ్ పరిస్థితి విషమంగా ఉంది. దీంతో అతడిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## 27 నుంచి స్టాఫ్‌నర్స్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖలో స్టాఫ్‌నర్స్ ఉద్యోగాల కోసం రాతపరీక్షలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27న ప్రారంభమై జనవరి ఆరో తేదీ వరకు జరగనుంది. ఈ మేరకు వైద్య,ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బీ) ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. దీనికి ఆ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పరిశీలనకు 70 మంది అధికారులను ప్రత్యేకంగా నియమించారు. మొత్తం 7094 స్టాఫ్‌నర్స్ పోస్టులకు రాతపరీక్ష నిర్వహించగా 40,936 మంది పరీక్ష రాశారు.



## మరోసారి పెరిగిన కోడిగుడ్డు ధర..

గతనెలలో కార్తీకమాసం కారణంగా నాన్ వెజ్ ధరలు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే.. కిలో చికెన్ ధర కూడా 100 కేజీ పలికింది.. ఈ వారం నుంచి ధరలు భారీగా పెరిగాయి.. అదే విధంగా కోడి గుడ్డు ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి.. కేవలం వారం రోజుల్లోనే ధరలు మరోసారి పెరిగాయి.. హైదరాబాద్ లో కోడి గుడ్డు ధర భారీగా పెరిగింది.. రెండు వారాల కింద ఒక్కో గుడ్డు రూ.6 ఉండగా, ఇప్పుడు రూ.7కు చేరింది. హోల్ సేల్‌లో ఒక్కో గుడ్డు రూ.5.80 పలుకుతోంది. కొన్ని రోజులుగా చలి బాగా పెరిగింది. దీంతో వెచ్చదనం కోసం ఆహారంలో కోడిగుడ్ల వినియోగం భారీగా పెరిగిందని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఎగ్స్‌కు ఫుల్ డిమాండ్ ఉందని చెబుతున్నారు.. మిగితా నగరాలతో పోలిస్తే హైదరాబాద్ లో కోడిగుడ్ల వాడకం ఎక్కువగానే ఉందని అధికారులు చెబుతున్నారు.. గుడ్ల ధర పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని తెలుస్తుంది.. అందులో కార్తీకమాసం ముగియడంతో ధరలు పెరిగాయి. అలాగే, కోళ్ల దాణా ధరలు రెట్టింపు అవ్వడం కూడా గుడ్ల ధరలు పెరగాడానికి కారణమని సుబ్బరాజు చెప్పారు. గతంలో కరోనా టైమ్ లో గుడ్ల వినియోగం పెరిగిందని, ఇప్పుడు మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయన్న ప్రచారంతో చాలామంది ఎగ్స్ తింటున్నారన్నారు..




## తింటున్నప్పుడు భుజం తగిలిందని బాలుడిని చంపేశాడు!

తింటున్నప్పుడు భుజం తగులుతుందని 17 ఏళ్ల బాలుడ్ని మరో మైనర్ చంపేశాడు. ఈ ఘటన ఢిల్లీలో చోటు చేసుకుంది. ద్వారకాలోని రోహతాష్ నగర్‌లో ఓ బాలుడు సమీపంలో ఉన్న హోటల్‌కు వెళ్లాడు. అక్కడ మోమోలు తింటున్న మరో బాలుడికి బాధితుడి భుజం తగిలింది. దాంతో వారిద్దరూ గొడవపడ్డారు. క్షణికావేశంలో పక్కనే ఉన్న కత్తి తీసుకుని బాలుడ్ని దారుణంగా పొడిచి పారిపోయాడు. గాయపడిన బాలుడ్ని ఆస్పత్రికి తరలించగా.. మార్గ మధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు.




# కేయూలో ర్యాగింగ్ కలకలం.. 81 మంది విద్యార్థినులు సస్పెండ్

వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ర్యాగింగ్ తీవ్ర అలజడి రేపింది. లేడీస్ హాస్టల్‌లో ర్యాగింగ్‌కు పాల్పడడం చర్చనీయాశంగా మారింది. జూనియర్ విద్యార్థులపై అమ్మాయిలు ర్యాగింగ్ చేయడం కలకలం రేపింది. గత కొన్ని రోజులుగా ర్యాగింగ్ జరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తాజాగా అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారన్న కారణంతో ఏకంగా 81 మంది విద్యార్థినులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇలా ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులను సస్పెండ్ చేయడం వర్సిటీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. పరిచయాల పేరుతో పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులు జూనియర్లపై ర్యాంగింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో పద్మావతి మహిళా వసతి గృహంలో ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థినుల వివరాలు సేకరించిన అనంతరం విద్యార్థినులను సస్పెండ్ చేశారు. సస్పెన్షన్‌కు గురయిన వారిలో పీజీ 28 , కామర్స్ 28, ఎకనామిక్స్ 25 మంది, జువాలజీ సెకండ్ ఇయర్ విద్యార్థినులు ఉన్నారు. విద్యార్థినులను వారం రోజులు పాటు సస్పెండ్ చేశారు. ఇదిలా ఉంటే మిగతా విభాగాల్లోనూ ర్యాగింగ్‌కు పాల్పడిన వారి వివరాలను సేకరించే పనిలో పడ్డారు వర్సిటీ అధికారులు. ఆధారాలు లభిస్తే ర్యాగింగ్ చేస్తున్న వారిని సస్పెండ్ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఇక శనివారం నుంచి డిసెంబర్ 31 వరకు క్రిస్మస్ సెలవులు ప్రకటించిన అధికారులు, విద్యార్థులు వెంటనే హాస్టల్స్‌ను ఖాళీ చేయాలని తెలిపారు. ర్యాగింగ్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు.



## బుట్టబొమ్మకు లక్కీ ఛాన్స్!

హీరోయిన్ పూజా హెగ్డేనిజంగా లక్కీ హీరోయిన్ అని చెప్పక తప్పదు. దశాబ్దం క్రితం ముఖముడి చిత్రం ద్వారా తమిళ చిత్ర పరిశ్రమకు కథానాయికగా పరిచయమైందీ బ్యూటీ. ఆ చిత్రం సరిగ్గా ఆడకపోవడంతో అక్కడ ఎవరు పట్టించుకోలేదు. కానీ తెలుగు చిత్ర పరిశ్రమ ఆమెను అక్కున చేర్చుకుంది. ఇక్కడ ఆమె నటించిన మహర్షి, అల వైకుంఠపురంలో వంటి చిత్రాలు సూపర్ హిట్ కావడంతో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోయింది. ఆ తర్వాత ఆమె నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ కావడంతో గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. తాజాగా మళ్లీ చిత్ర నిర్మాణం చేపట్టడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఈ సంస్థ ఒక ప్రముఖ ఓటీటీ సంస్థ కోసం సినిమా నిర్మించబోతున్నట్లు తెలిసింది. ఈ చిత్రానికి డిమాంటి కాలనీ, ఇమైకా నొడిగల్ చిత్రాల దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. ఇది లేడీ ఓరియంటెడ్ కథాచిత్రంగా ఉంటుందని, ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

## టీమిండియాకు ఊహించని షాక్.. సూర్యకుమార్ గాయం తీవ్రం!



అఫ్గనిస్తాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ! భారత టీ20 జట్టు తాత్కాలిక కెప్టెన్, ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ సుమారు నెలన్నర పాటు ఆటకు దూరం కానున్నట్లు సమాచారం. చీలమండ గాయం తీవ్రం కావడంతో అతడికి దీర్ఘకాలం విశ్రాంతినివ్వాలని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్వదేశంలో అఫ్గనిస్తాన్‌తో జరిగే టీ20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్ కానున్నాడని బీసీసీఐ వర్గాలు వెల్లడించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది. కాగా వన్డే వరల్డ్‌కప్-2023లో ప్రభావం చూపలేకపోయిన సూర్య.. ఈ మెగా టోర్నీ ముగిసిన తర్వాత ఆస్ట్రేలియాతో పొట్టి ఫార్మాట్ సిరీస్‌లో దుమ్ములేపాడు. సొంత గడ్డపై.. తొలిసారిగా టీమిండియా కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన ఈ ముంబై బ్యాటర్.. 4-1తో ఆసీస్‌పై ఐదు మ్యాచ్‌ల సిరీస్ నెగ్గాడు. ఆ తర్వాత సౌతాఫ్రికా పర్యటనలో భాగంగా టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసి సత్తా చాటాడు. ఆటగాడిగా, సారథిగా అద్భుతంగా రాణించి సఫారీ గడ్డపై ఆతిథ్య జట్టుతో ట్రోఫీని పంచుకున్నాడు. ముఖ్యంగా సౌతాఫ్రికాతో నిర్ణయాత్మక మూడో టీ20లో సెంచరీతో చెలరేగి జట్టును గెలిపించాడు. 56 బంతుల్లోనే 100 పరుగులు చేసి సుడిగాలి ఇన్నింగ్స్‌తో టీమిండియా 106 పరుగుల తేడాతో భారీ విజయం అందుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఈ మ్యాచ్ సందర్భంగానే సూర్యకుమార్ యాదవ్ గాయపడిన విషయం తెలిసిందే. జొహన్నస్‌బర్గ్‌లో డిసెంబరు 16న జరిగిన మూడో టీ20లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో సూర్య అదుపుతప్పి కిందపడిపోయాడు.

గాయం తీవ్రం..

దీంతో అతడి మడిమ మెలిక పడింది. ఈ క్రమంలో నొప్పితో విలవిల్లాడిన సూర్యను పర్యవేక్షించి చికిత్స అందించింది వైద్య బృందం. ఈ నేపథ్యంలో సూర్య మైదానాన్ని వీడగా రవీంద్ర జడేజా సారథిగా వ్యవహరించాడు. అయితే, మ్యాచ్ అనంతరం సూర్య మాట్లాడుతూ.. తాను బాగానే ఉన్నట్లు తెలిపాడు. కానీ.. తాజా సమాచారం ప్రకారం.. సూర్య చీలమండ నొప్పి తీవ్రమైనట్లు తెలుస్తోంది. ఈ విషయం గురించి బీసీసీఐ వర్గాలు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడుతూ.. "కోలుకోవడానికి సూర్యకుమార్‌కు మరికొంత సమయం కావాలి.



## లాలూతో లాలన్ దోస్తీ.. జేడీయూ అధినేతగా మళ్లీ నితీశ్!

బీహార్ అధికార పార్టీ జనతా దళ్(యునైటెడ్) పగ్గాల్ని మళ్లీ ఆ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అందుకోబోతున్నారా? తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. మరో వారంలోగా దీనిపై అధికారిక ప్రకటన కూడా వెలువడొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం జేడీయూ చీఫ్‌గా రాజీవ్ రంజన్ అలియాస్ లాలన్ సింగ్ ఉన్నారు. అయితే తప్పించే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు నితీశ్ కుమార్‌నే పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని పలువురు సీనియర్లు కోరుతున్నారట. ఈ క్రమంలో.. ఢిల్లీలో డిసెంబర్ 29వ తేదీన జరగబోయే పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.